
# పాత ముఖాలు



రవిబాబు ఈ రోజు చాలా ఉత్సాహంగా ఉన్నాడు. గొప్ప ఖుషీగా ఉన్నాడు.

ఎందుచేత?

ఎందుచేతనగా, రవిబాబు అప్పటి మధురక్షణాల మండలంలో విహరించబోతున్నాడు. దివ్యస్వప్నంలో దివ్యంగా విహరించబోతున్నాడు. గత విద్యార్థి దశ అంచులను ఆప్యాయంగా స్పృశించబోతున్నాడు.

అక్కడ 'ఓల్డ్ స్టూడెంట్ కౌన్సిల్' అనేది ఆ మధ్య ఏర్పడింది. కాలేజీ వదిలేసిన మాజీ విద్యార్థులంతా ప్రతి ఏడాదీ కాలేజీలో 'ఏనివర్సరీ' చేసుకోవడమనేది జరుగుతూంది.

ఈ రోజు లెవన్త్ ఏనివర్సరీ.

లెవన్త్ ఏనివర్సరీకి రవిబాబు వెళుతున్నాడు. అందుకే అతి ఉత్సాహంగా ఉన్నాడు.

'విలువైనదీ, కల కానిదీ, కరిగితే కడు కమ్మనిదీ స్టూడెంట్ లైఫ్! దొంగిలించబడనిది, దోపిడికి గురికానిదీ, మహా గొప్ప దర్జాదీ స్టూడెంట్ లైఫ్! జీవితంలో మృదుమధురమైనదీ, మరి ఎన్నడూ రానిదీ స్టూడెంట్ లైఫ్ కాక మరేమిటి?' అంటాడు రవిబాబు.

రవిబాబు పదిహేనేళ్ళ కిందట స్టూడెంటు.

ఇప్పుడు రవిబాబు యజమానిగా, భర్తగా, తండ్రిగా, కొడుకుగా, అన్నగా బరువుల రాత, బాధ్యతల మోత. వారందరిగా ఆ రాతల మోతలను మోయడానికి ఎదురు గాలిలో తొక్కే సైకిల్లాంటి ఉద్యోగం.

జీవితమనే ప్లేగ్రౌండులో ప్లేయర్ విధి కాళ్ళకింద బంతి రవిబాబు. విధి ఓ కిక్కిస్తే రవిబాబు బొంబాయిలో పడ్డాడు. అక్కడ చిన్న ఉద్యోగం. అక్కణ్ణించి మరోక తన్ను తంతే బెంగుళూర్ ...అక్కణ్ణించి అదృష్టవశాత్తూ తను చదువుకున్న ఊరిలోకే తన్నబడ్డాడు రవిబాబు. పదో, పరకో ఎగ్స్ట్రా జీతం కూడాను.

పదిహేనేళ్ళకి మళ్ళీ పాత కాలేజీని సందర్శించబోతున్నాడు తను.

ఈ 'రోజు లెవన్త్ ఏనివర్సరీ.' కాని, రవిబాబుకి మొదటి ఏనివర్సరీ ఇదే మరి.

అందుకే రవిబాబు అత్యంత ఉత్సాహంగా ఉన్నాడు.

తన క్లాసులో ఎనభై మంది విద్యార్థులుండేవారు. ఇంకా తెలిసిన సీనియర్లు, జూనియర్లూ... వీళ్ళంతా ఏం చేస్తున్నట్లు? ఎలా ఉన్నట్లు? ఎక్కడ ఉన్నట్లు? అందులో ముఖ్యంగా మూడేళ్ళు కూడా పరీక్ష తప్పకుండా, ఒకే బెంచి వదలకుండా కేరింతలతో, కలివిడితో కలిసి ఒకే జట్టుగా ఉన్న వీర్రాజు, రాంబాబు, రాజారావు, విక్రమ్. . . వీళ్ళ సంగతి ఏమిటి? ఎక్కడ ఉన్నట్లు? ఇది విశాల పారిశ్రామిక నగరం కాబట్టి ఇక్కడే వీళ్ళంతా ఉండి ఉండవచ్చు. ఏం చేస్తున్నారో వీళ్ళంతా? వీళ్ళందరిలో తనకు ప్రాణస్నేహితుడు విక్రమ్. వాడిని చూడాలని గొప్ప తపనగా ఉంది తనకి. కాలేజీ వదిలేశాక ఒకటో రెండు ఉత్తరాలు విక్రమ్‌కి, తనకి ఉత్తరాలు నడిచాయి అంతే. ఇంతవరకూ వాడి వేర్ ఎబౌట్స్ తెలీవు. ఏనివర్సరీకి విక్రమ్ రాడా? ఎందుకు రాడు? తప్పక వస్తాడు. వాడితోబాటు వీర్రాజు, రాంబాబు, రాజారావు—వీళ్ళంతా వస్తారు. ఇంకెందరో వస్తారు. పై ఊళ్ళనుంచి సెలవులు పెట్టుకొని వస్తున్న వాళ్ళుకూడా ఉన్నారట. అందులోను ఈ రోజు ఆదివారం. అందుచేత అందరూ వస్తారు; వస్తారు.

రవిబాబుకి గొప్ప ఉత్సాహంగా ఉంది. పట్టరాని సంతోషంగా ఉంది.

దుర్గంధపూరితమైన దరిద్రపు బతుకులో పొర్లుతున్న తనకు వీర్రాజు, రాంబాబు, రాజారావు, విక్రమ్ లాంటి లేత ముఖాల నిష్కల్మష స్నేహ సుగంధ పరిమళంతో విరబూచిన ఆ విద్యార్థి దశే అప్పుడప్పుడు కాస్త రిలీఫ్. అందుచేతనే ఆ ఉక్స్‌పెన్ కవర్ రీలు తన మస్తిష్కంలో పదిలపరుచుకున్నాడు రవిబాబు భద్రంగా, అపురూపంగా.

అప్పటి తీయని రోజులు కమ్మని కలగా మిగిలింది. ఆ కమ్మని కల మళ్ళీ తీయని రోజు కాబోతూంది ఈ రోజు. అందుకే రవిబాబు ఉత్సాహంతో, సంతోషంతో విజిల్ వేస్తూ, మరోసారి దువ్విన తలనే దువ్వుకొని ఇంట్లోంచి తెల్లారకముందే బయట పడ్డాడు. తను ఉక్కు చీకటి కొట్లోంచి, ఉక్కిరి బిక్కిరి చేసే ఉక్కలోంచి చల్లని పైరుగాలి లోకి, ప్రియురాలి పైట రెపరెప లోకి వెళుతున్నంత ఇదిగా ఉన్నాడు రవిబాబు. పంజరంలోని పిట్ట వచ్చిక బయళ్ళ విహించి పెండి మబ్బుల్లోకి రివ్వు రివ్వున రెక్కలు చరుచుకొని ఎగిరిపోతున్నట్టుగా రవిబాబు ఎగిరి ఎగిరి కాలేజీ ఆవరణలో పడ్డాడు.


కాలేజీని పరికించి పరికించి చూశాడు. అప్పటిలాగే ఉందా? ఏమైనా మారిందా?

అలాగే ఉంది, కాని, కొద్దిగా మార్పు చెప్పుకోదగ్గంత ఉంది. కాలేజీ ఎంత అందంగా ఉంది!

కాలేజి భవనం అర్ధవలయాకారంలో ఎలా ఉందంటే నేలపై పడిపోయిన అందాల నెలవంకలా ఉంది. అప్పుడే లేచి, జూలు దులుపుకొని ఆవలిస్తున్న సింహంలా బద్ధకంగానూ, భారీగానూ ఉంది. దర్బారులో రాజాధిరాజ రాజ మార్తాండలా దర్జాగా ఉంది. వెనక కొద్ది దూరంలో హాస్టల్సు రెండూ ఉన్నాయి. కాలేజీ భవనం పక్కనే తాటాకు పక్షం లాంటి రెండు కొండలూ, చుట్టూ మామిడితోటలూ, ఆ పక్కనే పొడవుగా పెద్ద లోయ. . . లోయలో దేవుడు పైర్లు కొట్టడానికి వనం సృష్టించాడా అనిపించే చక్కని తోట! ఓహ్! భవనం చుట్టూ ఎటు చూసినా చల్లని చూపులా, పసిపాప నవ్వులా మనోహరంగా ఉంది, ఆహ్లాదకరంగా ఉంది. ఇప్పుడు కాలేజీ మరీ బాగుంది. తను చదువుకునేటప్పుడు కాలేజీ ముని కన్యలా సింపుల్‌గా, అందంగా ఉంటే, ఇప్పుడు ఆ మునికన్యే ఆధునికంగా, అలంకరణతో ముసిముసి నవ్వుల పువ్వులు చల్లుతున్నట్టు ముచ్చటగా, ముగ్ధ మనోహరంగా ఉంది. ఇంతకు ముందు చుట్టూ ప్రహరీగోడ లేదు; ఇప్పుడు ఉంది. తోవ తోవ పొడుగునా స్వాగతం చెబుతున్నట్టు, ఆహ్వానిస్తున్నట్టు అశోక వృక్షాలు, సరివిడి మొక్కలూ లేవప్పుడు. క్రోటన్సు, నైట్‌క్వీన్లూ, బంతులూ, చేమంతులూ, గులాబులూ, మల్లెలూ—మరెన్నో రకరకాల, రంగు రంగుల పూలు అసలు లేనే లేవప్పుడు. ఇప్పుడివన్నీ ఎంత చక్కగా పెంచారు! సంతోషించవలసిన విషయం ఏమిటంటే, కమ్మని గుడిసెలు మొలిచి ఆ విద్యాలయపు అందాన్ని చెరిపేయలేదు. అయితే, బర్మా కాందిశీకుల కోసం కట్టిన పెంకుటిల్లు మారుమూలన దూరంగా కనిపిస్తాయి దిష్టిబొమ్మలా. మొత్తానికి ఆ ప్రాంతంలో విద్యాలయం ప్రకృతి ఒడిలో బిడ్డలా,

డి. హరనాథ్ రెడ్డి

దేవుడు ప్రత్యేకించి చిత్రించిన చిత్రంలా అనిపించి రవిబాబు చాలా హాయిపొందాడు. ఎంతో పరవశించిపోయాడు. తను పెళ్ళాం, పిల్లల్ని, తల్లీ చెల్లెళ్ళీ, బరువూ బాధ్యతల్నీ అన్నీ అంతా వదిలేసి, నెట్టేసి మళ్ళీ ఈ విద్యాలయంలో విద్యార్థి నైపోతే ఎంత బాగుండును అనుకున్నాడు.



శృంగారం నేపాల్ (ఆలయ శిల్పం) ఫొటో—డి. సుబ్రహ్మణ్యం (మద్రాసు—1)

ఆ రోజు ప్రోగ్రామ్ ప్రకారం ఉదయం టిఫిన్ తరవాత ఆటలపోటీలు, తరవాత లంచ్, ఆ తరవాత సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నిక, ఆ తరవాత సాయంత్రం ఛీఫ్ గెస్టు ఉపన్యాసం, డ్రామా, పాటలూ, ఫాన్సీ డ్రెస్సులూ, మానోపిక్షన్లూ, చివర్లో ప్రయిజ్ డిస్ట్రిబ్యూషన్. . . అదీ కార్యక్రమం.

రవిబాబు వచ్చినంత వేగంగా, ముందుగా ఎవరూ రాలేదు — ఆఫీసు బేరర్సు, కమిటీమెంబర్సు తప్పించి. ఒక్కడే కాలేజీ, హాస్టల్సు కలియ తిరిగాడు. హాస్టల్లో తను అప్పుడు ఉన్న గదికి వెళ్ళాడు. ఆ గది ఎలా ఉందో? ఏ మహాను భావుడు ఉన్నాడో చూద్దామని వెళితే ఇంకేముంది! గది తాళం వేసి ఉంది. ఓహ్... దసరా సెలవులు గదా... అక్కణ్నించి తన క్లాస్‌రూమ్‌కి వెళ్ళాడు. అప్పటి తన సీటులో చాలా సేపు కూర్చు న్నాడు. గతాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. నవ్వుకున్నాడు. డెస్కును మద్దెల వాయించాడు. కూనిరాగాలు తీశాడు. కాగితా లతో రాకెట్లు చేసి బోర్డు మీది కొదిలాడు. నిట్టూర్చాడు. పైకి వచ్చే శాడు.

మాజీ విద్యార్థులంతా ఒకరూ, ఒకరూ వస్తున్నారు. తెలిసిన ముఖాలు ఒకటీ రెండూ పలకరించాయి. హాస్టల్ మెస్‌కు వెళ్ళాడు. టిఫిన్ తయార్. ఉప్మా!

రవిబాబు నోట్లో వేసుకున్నాడు. నోరు కాలిపోయింది. 'హాబ్బా!' అందా మనుకున్నాడు గాని, పీక్కెకుండా నోరు అంటుకు పోయింది. ఒకటో రకం పేస్టు. ఇదే ఇల్లయితే ఇల్లాలు ముఖం ఉప్మాలో పరమపావనం అయిపోయేది. ఇక కాఫీయా! అది కాఫీ కాదు, కషాయం. దానికితోడు ప్లాస్టిక్ గ్లాసుల కంపు!

రవిబాబు కొంత దూరం నడిచి నడిచి ఒక మామిడిచెట్టు కింద పడు కున్నాడు. రవిబాబుకి తల్లి ఒడిలో పడుకున్నట్టనిపించింది. దేవతలు దిగివచ్చి అదృశ్యహస్తాలతో తనకు గాలి విసురు తున్నారా అన్నంతగా చల్లని గాలి చక్కగా, చిక్కగా తగులుతూంది. ప్రాణం ఎంతో హాయిగా ఉంది. ఏవో తెలియని లోకాల్లోకి తేలిపోతున్నట్టుగా ఉంది. మురికి కూపం లాంటి తన బతుక్కి దూరంగా జీవిత మంతా ఇలా హాయిగా, నిశ్చింతగా ఉండి పోవాలని ఉంది. ఉండిపోయి ఇక్కడే చచ్చిపోవాలని ఉంది అని అనుకుంటుండగా రవిబాబు చెవిలో 'భం భం భబబ్బామ్' అని పిడుగు పడింది. బాంబు పేలింది.

ఉలిక్కిపడి లేచాడు రవిబాబు. బాంబు పేల్చిన పిడుగ్గాడు పకపకా నవ్వుతు న్నాడు! . . . ఎవరు?

ఇంకెవరు? వీర్రాజు!

అరె. అరె. వీర్రాజు! హాయ్ హాయ్ వీర్రాజు!

రవిబాబు వీర్రాజుని గట్టిగా వాటేసు కున్నాడు. వాణ్ణి తనివితీరా చూశాడు.

వెధవ — ఎంత మారిపోయాడు! అప్పుడు ఎండి సరంలా ఉండేవాడు. ఇప్పుడు ఏనుబోతే ఏనుబోతు. అప్పుడు పొట్ట లేదు. ఇప్పు డున్నది పొట్ట కాదు—తొమ్మిదో నెల కడుపు! అప్పుడు మెడ సన్నగా, కొంగ మెడలా ఉండేది. ఇప్పుడా మెడ ఏది? మంచులా కరిగిపోయిందా? మెడ స్థానంలో గంగడోలు చోటు చేసుకుంది. డొక్కు ఇంజను స్టార్టు చేస్తే బాడీ బాడీ అంతా బడబడమని కదిలిపోయే టట్టు వాడు నవ్వితే ఒళ్ళంతా ఊగి పోతూంది. ఒరి దిబ్బ వెధవ అను కున్నాడు.

ఇద్దరూ అక్కడే పతికిలబడి చాలా కబుర్లు చెప్పుకున్నారు. మరెన్నో సంగతులు మాట్లాడుకున్నారు. కాలేజీ కుర్ర చేష్టలని నెమరు వేసుకున్నారు. పళ్ళు పదహారూ బయట పెట్టారు. అంతే, అప్పటి శ్రీరాజాతోనే అప్పటిలాగే మాట్లాడుతున్నట్టు అనుభూతి పొందలేకపోయాడు రవిబాబు.

శ్రీరాజా ఆఫీసర్నని చెప్పుకున్నాడు. తన చేతికింద పదిమంది ఉద్యోగులున్నారన్నాడు. వాళ్ళని ఎలా కమాండు చేసేది గొప్పగా, ధాటిగా చెప్పుకున్నాడు. ఖరీదైన వాళ్ళతో పేకాట, తాగుడు తన నాగరికతగా వివరించాడు. ముచ్చటైన ముగ్గురు పిల్లలని చెప్పాడు. తన భార్య అందగత్తె అని, గొప్ప ఇల్లాలని చెప్పాడు. కాని, అసలు విషయం ఆమె తనతోనే ఉంటూ మరొకతనితో అక్రమ సంబంధం పెట్టుకున్నట్టు, తను చూస్తూ ఏమీ చేయలేకపోతున్నట్టు, ఆమె తెచ్చిన డబ్బుకే, తను చుట్టూ ఉన్న సంఘానికీ భయపడి దిగులంతా గుండెల్లో దిగమింగుకొని, ముఖానికి తెచ్చి నవ్వు పులుముకున్నట్టు చెప్పలేదు కాక చెప్పలేదు.

చీకటి బతుకుని తెర వెనక్కి నెట్టి, తెరమీద తేలిపోని గొప్పలకు పంచ రంగులు పులమడం! అప్పటి స్వచ్ఛతా, అప్పటి నిష్కాపట్యం ఏది? కుండ బద్దలు కొట్టినట్టు మనసు విప్పి మాట్లాడ్డం ఏదసలు?

అప్పటి శ్రీరాజాకీ, ఇప్పటి శ్రీరాజాకీ ఆకృతిలోనే కాదు, స్వభావంలోనూ ఎంత తేడా?

శ్రీరాజాని చూడగలిగానన్న ఆనందం రవిబాబు పొందితే, పొంది ఉండవచ్చు గాని, అప్పటిలా శ్రీరాజాతో ఎంజాయ్ చేయలేక పోయాడన్నది రవిబాబు ముఖంలో స్పష్టంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

రవిబాబు మిగతా స్నేహితులు రాజారావు, రాంబాబు, విక్రమ్‌ల గురించి అడిగాడు. రాజారావు గురించి తప్ప తక్కిన ఇద్దరి గురించి తెలీదన్నాడు. రాజారావు పేనుగుమాస్తా అని, తనకప్పుడప్పుడు కనిపిస్తాడని చెప్పాడు. ఇంకా వాడి గురించి వివరాలు అడిగితే అంతకన్న మరేమీ తెలీదన్నాడు. అంటే, స్నేహం సాగడం లేదన్న మాట. వెధవ — పేనుగుమాస్తా గాడితో నా లాంటి ఆఫీసర్ స్నేహమేమిటి? అన్న ధోరణి శ్రీరాజాలో కనిగట్టి రవిబాబు నొచ్చుకున్నాడు.

చాలా పొద్దుపోయింది. ఇద్దరూ లేచారు. ప్లేగ్రౌండు మీద జనం గుంపులు గుంపులుగా ఉంటే అటు వైపు బయలుదేరారు. చేరారు. ఎవర్నో చూసి 'హాల్లో' అంటూ శ్రీరాజా రవిబాబు నుంచి వెళ్ళిపోయాడు. మళ్ళీ రాలేదు. అవును, మరి తనేమన్నా ఆఫీసరా ఏమా? రాజారావులా పేను గుమాస్తాగాణ్ణే కదా అని బాధ పడ్డాడు రవిబాబు. 'స్నేహం' అనేది సినిమాలకీ, నవల్సకీ పరిమితం తప్ప నిజ జీవితంలో అది వట్టి బోడి మాటేమో అనిపించి నిట్టూర్చాడు రవిబాబు.

ఆటలపోటీలు సాగుతున్నాయి.

ఆడేవారిలోనూ, ఆడుతున్న వారిని చూస్తున్న వారిలోనూ మిగతా ముగ్గురు స్నేహితులుగాని, క్లాసుమేటుగ్గాని, చివరికి తెలిసిన ముఖాలు గాని ఉన్నారా?

వెదికాడు రవిబాబు, తీర్థంలో తప్పిపోయిన పిల్లల్ని వెదుకుతున్నట్టు.

ఒకరిద్దరో, ఒకరో పరిచయ ముఖాలు కనిపించారు. పలకరింపులు, ఏం చేస్తున్నా వంటే, ఏం చేస్తున్నావ్. బస్. అయి పోయింది! అంతా కనిపిస్తున్నారు గాని, రాజారావు, రాంబాబు, విక్రమ్ కాన రాలేదు . . . వారు రాలేదా? మరిక రారా?

ఆటల పోటీలు చూస్తున్నాడు రవిబాబు. ఆటలు పిచ్చిగా ఉన్నాయి. నవ్వు పుట్టుకొస్తున్నాయి.

ఆడుతున్నవాళ్ళంతా ఒకప్పుడు మంచి ప్లేయర్సు. పెద్ద ఆటగాళ్ళు. కాలేజీ వదిలాక, జీవితమనే ముళ్ళబాటలో బ్రతుకుతెరువు వెదుకులాటలో కిందా మీదా కొట్టుకు పోతుంటే, ఆటలు ప్రాక్టీస్ చేసే తీరిక, ఓపిక, ఉత్సాహం ఇకనేం ఉంటాయి? ఉన్నా మన దేశంలో స్పోర్ట్సుకు ఎంకరేజ్‌మెంటేది? పదు పోయారేని? . . . వీళ్ళు కాలేజీలో అప్పుడెప్పుడో ఆడాక మళ్ళీ ఇదే ఆడ్డం! ఇంకెలా ఉంటుంది? చిన్న పిల్లల ఆటల కన్న ఘోరం కాకపోతే, అప్పటి పెద్ద ప్లేయర్సు ఇప్పుడు చేతగాని వాళ్ళా ఆడి నవ్వుల పాలౌతున్నారు. నవ్వుతున్న వాళ్ళంతా 'మనం కనీసం ఈ రోజైనా నవ్వాలి' అని నిర్ణయం తీసుకుని పట్టుదలగా నవ్వుతున్నట్టు అనిపించిన రవిబాబుకి ఒక రకమైన జాలి వేసింది వాళ్ళమీద.

ఇంతలో ఒక ప్లేయర్ విసిరిన డిస్కు విష్ణుచక్రంలా కదిలి, ముందుకు వెళ్ళకుండా వర్షమని మనుషుల మీది కొచ్చింది. 'జాగ్రత్తోయ్' అన్నారు. రవిబాబు చావలేదు. దబ్బున కూర్చుండి పోయాడు. లేకుంటే మెడకాయ మీద తలకాయ తెగిపోయి ఎగిరిపోయేది. 'ఇక్కడుండడం అంత క్షేమకరం కాదురా బాబు'ని కదిలాడు. అడిటోరియంలోకి వెళ్ళాడు. అక్కడంతా హాహోసెలిడుతున్నారు. ఆడుతున్న వారిలో కొందరు రవిబాబుని పలకరించారు. మరికొందరిని రవిబాబే పలకరించాడు. ఒక్కొక్క నంబరూ తీసి చెబుతుంటే కేకలెయ్యడం, ఈలలు వెయ్యడం, జోకులు పేల్చడం, ఫకాల్న నవ్వడం . . . పెంకితనం చేస్తున్నారు. వీళ్ళంతా చదువుకునేటప్పుడు మహా పెంకితనం చేసినవాళ్ళు. అందుచేత అప్పుడు పెంకివాళ్ళం కాబట్టి ఇప్పుడు పెంకితనం చేయక తప్పదని చేస్తున్నట్టుగా తోచింది రవిబాబుకి. ఇదంతా చూస్తూంటే అదేదో సినిమాలో ఏభై మూడేళ్ళ ముసలి నటుడు పదహారేళ్ళ వాడిలా కనిపిద్దామని హాఫ్ పేంటు వేసుకున్నట్టుంది. హాఫ్‌పేంటు వేసుకుని నోట్లో ఐస్‌క్రీమ్ పెట్టుకొని, హాఫ్ టిక్కెట్‌తో రైలెక్కి టి. సి. ముందు కుర్రాడి చేష్టలు చేసినట్టుంది. ఉయ్యాల్లో బోసినవ్వుల పాపను చూసి పాపై పోదామని, ఉయ్యాల్లోంచి పాపని తీసి పారేసి, పళ్ళూడ గొట్టుకుని, బట్టలు విప్పేసి, ఉయ్యాలెక్కేసినట్టుంది. వాళ్ళను చూస్తూంటే అనుకున్నాడు రవిబాబు. అవును, మరి. ఏ వయసులో చేష్టలు ఆ వయసులోనే అందం, అర్థమూను.

రవిబాబుకూడా హౌసీ ఆడాడు. మూడు రూపాయలు లాస్! ప్చ్! ఏం చేస్తాం?

మధ్యాహ్నం లంచ్. వెజిటబుల్ బిరియానీకెటీ.

ఏం లాభం? చెత్తగా ఉంది. బిరియానీ చెత్తలా ఉందనుకుంటే చెత్తలో చెత్తలా పిల్లికూతలూ, కుక్క అరుపులూ, గ్లాసుల గలగలలూ, బల్ల దబదబలూ, జోకులూ, ఈలలూ, బొండ్రకప్ప నవ్వులూను . . .

కుర్రవాళ్ళ చేష్టలు పెద్దవాళ్ళు చేస్తుండడం వల్ల మొత్తం మెంటల్ హాస్పిటల్ భోజనశాలలా రవిబాబు ఫీలయి నవ్వుకున్నాడు, తనెందుకు వీళ్ళందరిలాగా ఎంజాయ్ చేయలేకపోతున్నాడని? తనే కాదు, ఎంజాయ్ చేస్తున్నట్టు కనిపిస్తున్న వీళ్ళంతా నిజంగా ఎంజాయ్

విన్నా-మువ్వ చిత్రం—ఎస్. మురళీధరరావు (ఏలూరు)



చేయడం లేదు. అంతా నటనే! తప్పుపెట్టుకున్నది.

అలా అని ఎలా చెప్పగలుగుతున్నావ్ రవి బాబూ?

ఏముంది, కుర్రవాళ్ళం నిజంగా కాక పోవడమే. ఇప్పుడు ఏ పని చేద్దామన్నా ఆలోచనే. భయం. వెనకడుగు. సర్దుకు పోవడం, బానిసత్వానికి తల వంచడం అంతే. వీళ్ళందరిలో అప్పటి జీవం, కళ, చైతన్యం ఏవీ? పొగరు, ఒగరూ, కోపం, ప్రకోపం ఏవీ? అప్పటి మిడిసిపాటు, ఉద్రేకం, స్వచ్ఛమైన నవ్వు, లోకాన్నే ఎదిరించగల ధీమా, దర్జా, దర్పం ఏవసలు? లేవు. లేవు 'నాయనా' లేవు. మళ్ళీ మళ్ళీ రావు. లేనిదాని కోసం అంగలాలు పడి పిచ్చివాళ్ళుగా బయట పడిపోవడం!

ఈ పిచ్చివాళ్ళేనా అప్పుడు నిజంగా వెంకితనాలు చేసింది? మిడిసిపాటు పడింది? అనుకున్నాడు రవిబాబు.

బిరియానీ గొడ్డుం కేసే జావలా ఉంది. బయట పడ్డాడు రవిబాబు. చేతులు కడుక్కొని కిళ్ళీ వేసుకుంటుంటే ఎవడో వెనకనుంచి ఛట్ మనిపించాడు నెత్తిమీద. చెళ్ళ గట్టిగా తగిలిందేమో రవిబాబుకి చిర్రెత్తు కొచ్చింది. వెను తిరిగి చూశాడు. చూస్తే ఇంకెవరు? రాజారావు.

వాణ్ణి పోల్చగలిగాడేతను! హమ్మయ్యా, కడుపు నిండిపోయింది అనుకున్నాడు రవి బాబు.

"ఏరా, తెల్లారినుంచి చూస్తున్నా? చస్తున్నా. రాలేదేం? ఇదేనా రాడం. అంటే తిండి కోసం పరిగెత్తుకొచ్చా వన్న మాట."

"ఎగ్జాక్ట్లీ, నాయనా! మన దగ్గర బలత్కారంగా అయిదు రూపాయలు చందా కలెక్ట్ చేశారు. మనీ ఇవ్వకూడ దనుకుంటే వెధవ మొగమాటం మనకి. ఇష్టం లేకపోయినా ఇవ్వవస్తేం, భాయీ! అందుచేత నేబిరియానీ తిని అయిదు రూపాయలూ కట్టించేద్దామని వచ్చాను. థాంక్స్."

"ఓరి వెధవా! ఆ బిరియానీ గొడ్డు తినవు. కుక్కలు ముట్టవు, తెలుసా."

"తెలీనక్కర్లేదు. గొడ్డు తినక పోయినా నేను తిన గలను. అయిదు రూపాయల్ని కట్టేన్రా, బాబూ, అయిదు రూపాయలు! మాటలా? అంత కట్టేనని తలుచుకుంటే చాలు రాళ్ళుకూడా గొంతుకలోంచి కరిగెళ్ళిపోతాయి. ఉండుండు. ముందు భోజనం. తరవాత విశేషాలు" అని మెస్సులోకి పరిగెట్టాడు రాజారావు.

అరగంట భోజనం చేసి బ్రేవ్ మంటూ వచ్చాడు." ఒరేయ్! డిసెంట్

పట్టుకోగల్గురా" అన్నాడు రవిబాబు.

"మన కలాంటి భయం లేదు, భాయ్! పద. ఆ చెట్టు కింద కూర్చొని కాసేపు ముచ్చటిద్దాం."

ఆ చెట్టు దగ్గర కెళ్ళారు. కూర్చు న్నారు. ముచ్చటల్లో పడ్డారు.

రాజారావు ఎంత మారిపోయాడు?

చదువుకునే టైములో రాజారావుది లావు పర్సనాలిటీ. అప్పుడు వాడి చేష్టలు చిత్రంగా ఉండేవి. వాడి పొట్ట చాకలి బానలా ఎత్తుగా, అసహ్యంగా ఉండేది. అందుచేత పొట్ట తగ్గడానికి చాలాపుస్తకాలు రప్పించి అందులో ఉన్నట్టు ఆసనాలు వేసేవాడు. ఏమిటేమిటో రప్పించి వాటితో వ్యాయామాలు చేసేవాడు. వారం, వారం స్విమ్మింగ్‌పూల్ కెళ్ళి, డబ్బులు చెల్లించి రోజంతా ఈదేవాడు. అయినా, పాపం, వాడి పొట్ట తగ్గలే! అన్ని కష్టాలు పడ్డా పోని పొట్ట, రాజారావు కిప్పుడు మిల్లిమీటరంత ఏమిటి? అసలు లేదు పొట్ట! డొక్కలా ఉంది. మనిషి బక్కగా ఉన్నాడు.

వాడు చదువుకొనే టైములో ఇంకో గమ్మత్తుకూడా చేసేవాడు. తల దువ్వే టప్పుడు ఒక వెంట్రుక దువ్వెనలో చిక్కుకుంటే చాలు బంగారం పోయి నంత బాధ పడిపోయేవాడు. ఆ వెంటనే బయటకు పరిగెట్టి రకరకాల నూనెలూ, క్రీములూ, మందారప్పూలూ సంపాదించి కేశసంపదని కాపాడుకునేవాడు. అలాంటి రాజారావు తల ఇప్పుడు నున్నగా ఉంది! ఎంత నున్నగా ఉందంటే సంగీత ప్రియుడికి 'వాతాపి గణపతిం భజే హం' కృతిని పాడుతూ మద్దెల వాయించా లన్నంత నున్నగా ఉంది.

"అరే, రాజారావ్. నీ బంగారప్పు జుట్టుని రక్షించు కోలేకపోయినా, కడుపు మాత్రం తియించేసుకున్నావ్!"

రాజారావు నవ్వాడు. అది నవ్వా?

పెళ్ళి కావలిసిన ఇద్దరు చెల్లెళ్ళు, ముండమోసిన అక్క, మంచం మీద శవంకాని శవం లాంటి ముసలి తండ్రి, రోగిష్టి పెళ్ళాం, అయిదుగురు పిల్లలూ (అందులో నల్గురాళ్ళు ఆడపిల్లలేనట!), అరువులూ, అప్పులూ, దరిద్రపు కంపు కొట్టే కొంప, (అదీ అద్దెది!) గొర్రెతోక జీతం. . . నీటిలో, ఆ సుడిగుండంలో పడుమునకలయ్యే రాజా రావుకి జుట్టు రాలిపోవడం వింతా? అర్ధాకలితో, పేగులు అర్చుకు పోతుంటే ఇకనేం పొట్ట!

తల్లీ పిల్లా

ఫోటో—డి. సుబ్రహ్మణ్యం (మద్రాసు—1)



